ఎస్సీ వర్గీకరణ త్వరగా పూర్తి చేయాలి



ఎస్సీ వర్గీకరణ కమిషన్ చైర్మన్ షమీ అత్తర్‌తో ఎంఎస్ఎఫ్, ఎమ్మెస్పీ నాయకులు

కుత్బుల్లాపూర్: ఎస్సీ వర్గీకరణను త్వరగా పూర్తి చేయాలని ఎంఎస్ఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ షమీ అత్తర్‌ను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లోపు వర్గీకరణ పూర్తి చేస్తే మాదిగ ఉప కులాలకు ఎంతో మేలు జరుతుందని, అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు వెలువడుతున్న నేపథ్యంలో నిరుద్యోగులకు కూడా ఉపయుక్తంగా ఉంటుందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మేడ్చల్ జిల్లా ఎంఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి శివకుమార్, ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు రాసమల్ల యాదగిరి మాదిగ ఉన్నారు.

మానవ హక్కులపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కృషి హైస్కూల్ విద్యార్థులు

కుత్బుల్లాపూర్: అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సూరారం కాలనీలోని కృషి హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సామాజికవేత్త, ప్రపంచ మానవ హక్కుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి చికిలె మధుబాబు మాట్లాడుతూ.. ఐక్యరాజ్య సమితి విశ్వ మానవ హక్కుల ఒప్పంద పత్రం డిసెంబర్ 10న అమల్లోకి వచ్చిందన్నారు. కుల, మత, ప్రాంత, వర్గ, వర్ణ, లింగ వివక్ష లేని సమాజం కోసం మానవ హక్కులు ఉన్నాయన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన హక్కులు, బాధ్యతలు, చట్టాలకు తేడా, సమానత్వం, రిజర్వేషన్ లాంటి అంశాలపై ఆయన సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్, మానవ హక్కుల యువజన విభగాం కన్వీనర్ అమర్ కాంబ్లే, ఉపాధ్యాయులు మహేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వడ్డెర సంఘం మహిళా అధ్యక్షురాలిగా రమ



రమకు నియామక పత్రం అందజేస్తున్న సంఘం జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్

నిజాంపేట్: అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా కుచంపు రమ నియమితులయ్యారు. షాపూర్‌నగర్‌లోని ఉషోదయ టవర్స్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్ నియామక పత్రం అందజేశారు. అదేవిధంగా రాష్ట్ర యూత్ అధ్యక్షుడిగా నల్గొండకు చెందిన బొంత చిరంజీవి, యూత్ ప్రధాన కార్యదర్శిగా సంపంగి వెంకటేశ్‌ను నియమించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్, జాతీయ మహిళా అధ్యక్షురాలు వేముల తిరుమలాదేవి, గుంజ రేణుక, జాతీయ యూత్ అధ్యక్షుడు రమేశ్ మంజల్కర్, రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు హనుమయ్య, రాష్ట్ర కార్మిక సంఘం అధ్యక్షుడు సాతల గోపాల్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రేపన్ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే అధికారులుగా..

నిజాంపేట్ జడ్పీహెచ్ఎస్‌లో స్వయం పరిపాలనా దినోత్సవం



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు రఘునాథ్

నిజాంపేట్: నిజాంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ప్రజాప్రతినిధులై పాలన సాగించారు. విద్యాశాఖ మంత్రిగా మేఘనశ్రీ, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీగా దీపిక, పాఠశాల సంచాలకుడిగా సైదులు నాయక్, ఆర్జేడీగా కృష్ణవేణి, జిల్లా కలెక్టర్‌గా టీ అశోక్, డిప్యూటీ కలెక్టర్‌గా సాగర్, డీఈఓగా సహస్ర, డీడీఈఓగా విజయదుర్గ, ఎంఈఓగా ప్రవళిక, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా కుమారి వైష్ణవి వ్యవహరించారు. అదేవిధంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి రెగ్యులర్ ఉపాధ్యాయులను అనుకరిస్తూ టీఎల్ఎం ఉపయోగించి పాఠాలు బోధించారు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్‌గా వ్యవహరించిన విద్యార్థులు పాఠశాలను క్రమశిక్షణతో ఉంచడమే కాకుండా ప్రాంగణంలో విద్యార్థులకు ఆటపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రఘునాథ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఉపాధ్యాయ పాత్రల్లో విద్యార్థులు ఒదిగిపోయి చక్కగా పాఠాలు బోధించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో జీవితంలో క్రమశిక్షణతో ఉండి మంచి బాటలో పయనించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న విద్యార్థులు

ఆటో చోరీ

దుండిగల్: ఇంటి ముందు పార్క్ చేసిన ఆటో చోరీకి గురైన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. డీ పోచంపల్లి, సారెగూడెం ప్రాంతానికి చెందిన గోనె సాయిబాబా ఎప్పటిలాగే సోమవారం రాత్రి ఇంటి ముందు ఆటోను పార్క్ చేశాడు. మంగళవారం ఉదయం లేచి చూసేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఆటోను ఎత్తుకెళ్లారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓయూలో తుర్కిమెనిస్తాన్ బృందం పర్యటన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూను తుర్కిమెనిస్తాన్ దేశానికి చెందిన అధికారుల బృందం మంగళవారం సందర్శించింది. ఆ దేశ రాయబారి కాన్సుల్ షముహమ్మత్ మహ్మద్‌దోవ్ నేతృత్వంలోని సభ్యులు వీసీ ప్రొ. కుమార్‌ను కలిసి వివిధ అంశాలపై చర్చించారు. కోర్సులు, ఫీజుల వివరాలు, విదేశీ విద్యార్థులకు స్కాలర్‌షిప్, హాస్టల్ ఇతర వసతులు, బోధన, పరిశోధనలు, పరీక్షలు, ఫలితాలు తదితర అంశాలను వీసీ వారికి వివరించారు. ఓయూ అధికారులు పాల్గొన్నారు.

15 నుంచి గ్రూపు-2 పరీక్షలు

- రెండురోజుల పాటు నిర్వహణ
- అభ్యర్థుల కోసం 116 పరీక్షా కేంద్రాల ఏర్పాటు



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఈనెల 15,16 తేదీల్లో నిర్వహించనున్న గ్రూపు-2 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ గౌతమ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 116 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పేపర్-1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు.

◆ మొదటి సెషన్ అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఉదయం 8:30 గంటల వరకు రావాలని, 9:30 తర్వాత నిమిషం ఆలస్యంగా వచ్చిన వారిని కేంద్రంలోకి అనుమతించరన్నారు. రెండో సెషన్ అభ్యర్థులు మధ్యాహ్నం 1:30 వరకే కేంద్రానికి రావాలని, 2:30 దాటితే ప్రధాన గేట్ మూసివేస్తారని ఆయన పేర్కొన్నారు.

◆ అభ్యర్థులు ఎలాంటి క్యాలిక్యులేటర్లు, సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, పెన్‌డ్రైవ్ లు, బ్లూటూత్ పరికరాలు, వాచ్, వ్యాలెట్, హ్యాండ్ బ్యాగ్‌లు, పౌచ్‌లు, రైటింగ్ ప్యాడ్లు, నోట్స్, చార్ట్‌లు, లూజ్ షీట్‌లు, ఆభరణాలు (మంగళసూత్రం, బ్యాంగిల్స్- సంబంధిత వస్తువులు మినహా) తీసుకురావద్దని సూచించారు. అభ్యర్థులు బూట్లు ధరించకూడదని కలెక్టర్ సూచించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనల మేరకు హాల్ టికెట్‌లో సూచించిన విధంగా పీడబ్ల్యూడీ అభ్యర్థులకు మాత్రమే గంట సమయం అదనంగా ఇవ్వబడుతుందన్నారు. వీరు సదరమ్ సర్టిఫికెట్/అపెండిక్స్‌ను పరీక్ష రోజున సంబంధిత చీఫ్ సూపరింటెండెంట్‌కి అందించాలన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్‌పై ముద్రించిన సూచనలు చదివి అనుసరించాలని కలెక్టర్ సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బతుకమ్మబండకు చెందిన కృష్ణ కుమారుడు ప్రణవ్ అనారోగ్యంతో ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా గ్రోత్ హార్మోన్ ఇంజక్షన్ చేయించుకునేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతుండడంతో ఎమ్మెల్యే వివేకానంద్‌ను ఆశ్రయించారు. దీనిపై స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద రూ.2.10 లక్షల ఎల్ఓసీని మంజూరు చేయించి సదరు పత్రాన్ని పేట్‌బషీరాబాద్‌లోని కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారుడికి అందజేశారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి



ముద్దాపురం మదన్‌గౌడ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని కార్మిక నేత, శ్రమశక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్‌గౌడ్ సూచించారు. కొంపల్లిలో మహారాష్ట్ర బ్యాంక్ నూతన బ్రాంచిని సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బ్యాంక్ జీఎం జీహెడీ ప్రసాద్, శకుంతల దేవి, వెంకటరెడ్డి, నీలకంఠం, మేనేజర్ సురేశ్, తేజస్విని, పనేంద్ర, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తొలగింపు సరే.. తరలింపు ఎప్పుడో..?



చంద్రానగర్‌లో రోడ్డుపైనే వేసిన చెట్ల కొమ్మలు

చింతల్: చంద్రానగర్‌లో విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను ఇటీవల ఆ శాఖ అధికారులు తొలగించి రోడ్డు పక్కనే వేశారు. అయితే మరుసటి రోజే వాటిని తీసివేయాల్సి ఉండగా, 10 రోజులుగా అలాగే వదిలేయడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రాజకీయ సైద్ధాంతిక శిక్షణ తరగతులు షురూ



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసూఫ్

కుత్బుల్లాపూర్: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రాజకీయ సైద్ధాంతిక శిక్షణ తరగతులు షాపూర్‌నగర్ పొట్లూరి నాగేశ్వర్‌రావు భవన్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసఫ్ హాజరై ప్రారంభించి మాట్లాడారు. ఏ దేశంలోనైనా అభివృద్ధికి మూలం కార్మికులేనని, కానీ ఆ ఫలితం మాత్రం పెట్టుబడిదారులు మాత్రమే అనుభవిస్తున్నారన్నారు. కార్మికులు కేవలం ఉత్పత్తిలో భాగస్వాములై రాజకీయంగా దూరంగా ఉండడమే దీనికి ప్రధాన కారణమన్నారు. కార్మికులు రాజకీయ సైద్ధాంతిక అవగాహన కలిగి ఉంటేనే తగిన ఫలితం వస్తుందని, అందుకే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ముఖ్య నాయకులకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే ఇటీవల మృతి చెందిన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేశ్, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. తరగతులకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు స్వామి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించగా, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేశ్, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు రవిచంద్ర, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఆటో యూనియన్ కార్యదర్శి కృష్ణమూర్తి, నియోజకవర్గ అధ్యక్షుడు హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు



కసాపురం రఘుపతిరెడ్డి, డీఈ

కుత్బుల్లాపూర్ : విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల విద్యుత్ డిప్యూటీ ఇంజినీర్ (డీఈ) కసాపురం రఘుపతి రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. గతంలో వీధిలైట్ల వాడకంతో అధిక బిల్లులు వచ్చేవని అయితే రెండేళ్ల క్రితం అమర్చిన ఎల్ఈడీ లైట్లతో అతి తక్కువగా బిల్లులు వస్తున్నాయన్నారు. అలాగే పలు కాలనీల్లో విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో వాటికి లైట్లు లేవని, అందుకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించామని, టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని త్వరలోనే 500 లైట్లు రానున్నట్లు తెలిపారు. దశలవారీగా వాటిని బిగిస్తామని పేర్కొన్నారు. 6 నెలల క్రితం వరకు విద్యుత్ లైట్లు వెలగడం లేదని రోజుకు సుమారు 100కు పైగా ఫిర్యాదులు వచ్చేవని వాటిని 24 గంటల్లోనే పరిష్కరిస్తూ ముందుకు సాగామన్నారు. ప్రస్తుతం 30 ఫిర్యాదులు మాత్రమే వస్తున్నాయని వాటిని కూడా సత్వరంగా పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా పేట్ బషీరాబాద్ మేడ్చల్ ఆర్టీవో కార్యాలయం వద్ద అల్లం చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయగా అక్కడ సుమారు రూ. 5 లక్షలతో లైట్లు అమర్చినట్లు తెలిపారు. జంట సర్కిళ్ల పరిధిలో మొత్తం 31 వేలకు పైగా ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశామని, అంతే గాకుండా వాటి మరమ్మతులకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి ఫిర్యాదులు వచ్చిన వెంటనే సత్వరమే స్పందించేలా అప్రమత్తం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

క్షత్రియ సమాజ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేత మల్లారెడ్డి

సుభాష్‌నగర్: షాపూర్‌నగర్‌కు చెందిన సోమవంశ సహస్రార్జున క్షత్రియ సమాజ్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మేడ్చల్ జిల్లా బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.మల్లారెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమాజ్ అధ్యక్షుడు దిగుడు ప్రశాంత్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పురోగతిలో మానవ హక్కుల పాత్ర కీలకం

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రపంచ పురోగతిలో మానవ హక్కుల పాత్ర కీలకమని పలువురు వక్తలు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్ హాల్‌లో లా స్టూడెంట్స్ ఫోరం ఫర్ రిపబ్లిక్ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. న్యాయ శాస్త్ర విద్యార్థి రవితేజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయవాది, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రఘునాథ్ మాట్లాడుతూ.. మానవ హక్కుల కోసం న్యాయ శాస్త్ర విద్యార్థులు, న్యాయవాదులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది షకీల్, యూనివర్సిటీ ఆఫ్ లండన్ రీసెర్చ్ స్కాలర్ అన్వేష్ బాకీ, ఓయూ విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దగాపడ్డ కళాకారుల డప్పుల మోత

ఉస్మానియా యూనివర్సిటీ: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 12,13 తేదీల్లో 32 గంటల పాటు దగా పడ్డ కళాకారుల డప్పుల మోత కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కవి, గాయకుడు నేర్నాల కిశోర్ తెలిపారు. మంగళవారం ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ ఎదుట కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో దగాపడిన కళాకారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి న్యాయం చేయాలని కోరుతూ 32 గంటల పాటు డప్పుల మోత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు వలిగొండ నరసింహ, జంగిలి దర్శన్, బోరెల్లి సురేశ్, శాంగటి రాజేశ్, గణేశ్, వేముల సురేశ్‌యాదవ్, శంకర్‌యాదవ్, ప్రవీణ్‌నాయక్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్ల మూతలు..!



చింతల్ మార్కెట్ రోడ్డులో ధ్వంసమైన మ్యాన్‌హోల్ మూత

రంగారెడ్డినగర్: చింతల్ మార్కెట్ రోడ్డులో ఏడాది క్రితం వరదనీరు సాఫీగా వెళ్లేందుకు అండర్ గ్రౌండ్ డ్రెయిన్ పైపులైన్‌ను కల్వర్ట్ బ్రిడ్జి వరకు నిర్మించారు. అయితే మ్యాన్‌హోళ్లపై ఏర్పాటు చేసిన మూతలు నాసిరకంగా ఉండడంతో వాహనాల రాకపోకలతో కొద్దిరోజులకే ధ్వంసమయ్యాయి. తగు చర్యలు చేపట్టాల్సిన సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో వాహనదారులు అందులో ఇరుక్కుని ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధ్వంసమైన మ్యాన్‌హోళ్ల మూతలను తొలగించి కొత్తవి అమర్చాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.